క్లుప్తంగా

ఐదు వేల మందికి అన్నదానం



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా తత్త్వ ప్రచార మందిరంలో జరుగుతున్న గురుపూర్ణిమ ఉత్సవంలో భాగంగా సోమవారం మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుమారు ఐదువేల మందికి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. కమిటీ సభ్యులు భక్తులకు సహకరించారు.

నేడు అరసవల్లిలో ఆవేటి వారాలు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి గ్రామ దేవత అసిరితల్లి అమ్మవారి ఆవేటి వారాల పండుగ మంగళవారం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఖాజీపేట, అరసవల్లి గ్రామప్రజలంతా మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనం కోసం ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసినట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. కాగా అసిరితల్లి అమ్మవారి ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. స్థానిక విద్యుత్ కాంట్రాక్టర్ ఉంగటి పాపారావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సీపీఎస్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న వైద్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో సీపీఎస్ (కార్డియో పల్మనరీ రిసైసిటేషన్) పై ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీ క్లబ్, జేసీఐ సంయుక్తంగా సోమవారం విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీపీఎస్‌తో ప్రాణాలు కాపాడవచ్చునని వైద్యులు హర్షవల్లి, గొండు గంగాధర్‌రావు, భవానీ, వాసవీ తెలిపారు. ప్రతి విద్యార్థికీ ఈ విధానంపై అవగాహన ఉండాలన్నారు. సీపీఎస్ అనంతరం చికిత్స నిర్వహిస్తే సాధారణ జీవితం సాగించవచ్చన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రణస్థలం: విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని రావాడ పీహెచ్‌సీ వైద్యులు జనార్దన నాయుడు తెలిపారు. మండలంలోని రణస్థలం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు రావాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉన్న విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి తగిన సూచనలు చేశారు. వైద్యులు డి.రేవతి, ఎం.రమేష్, ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన వంట గది



కూలిన వంట షెడ్‌ను చూపిస్తున్న మహిళలు

ఎచ్చెర్ల క్యాంపస్: రామజోగిపేట ప్రాథమిక పాఠశాలలో ఉన్న వంట గది ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. వంటి గది కూలటంతో మధ్యాహ్నం భోజనం వంట ఏజెన్సీ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. వంట గది నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న ఈఈ సుగుణాకర్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ పబ్లిక్ అండ్ హెల్త్ విభాగం ఈఈ సాగిరి సుగుణాకర్‌రావు అన్నారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి ఏడాది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం ఇంజినీరింగ్‌లో నైపుణ్యం ఉన్న ప్రతి విద్యార్థికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. నిరంతరం క్లాస్ వర్కుకు హాజరుకావాలని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ నైపుణ్య కోర్సులు చదవాలని, సాంకేతిక అంశాలు నేర్చుకోవాలన్నారు. పిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, యాజమాన్య సభ్యులు పి.దుర్గాప్రసాద్‌రావు, డి.వెంకటరావు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హామీలను ప్రస్తావించాలి



శ్రీకాకుళం: వర్షం నీటితో నిండి చెరువును తలపిస్తున్న ఆర్ట్స్ కళాశాల మైదానం



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. వీటిని నమ్మిన జనం వారికి అధికారాన్ని కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం, పథకాల అమలు, నిధుల మంజూరుపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ జనానికి ఇచ్చిన హామీల అమలు కోసం శాసనసభలో ప్రస్తావించాలని డిమాండ్ చేస్తున్నారు.

శ్రీకాకుళం నియోజకవర్గంలో..

శ్రీకాకుళం: శ్రీకాకుళం నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే గొండు శంకర్ శాసనసభ సమావేశంలో ప్రస్తావించాలని ప్రజలు కోరుతున్నారు.

- శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు ఉన్న రోడ్డు కొంతవరకు పూర్తయ్యింది.దీనిపై ఆమదాల వలస, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు కూన రవి కుమార్, గొండు శంకర్‌తో పాటు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీలిచ్చారు. దీన్ని కూడా అసెంబ్లీలో ప్రస్తావిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.
- ఆర్ట్స్ కళాశాల మైదానాన్ని గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా, స్వాతంత్ర్య దినోత్సవం వేడుకగా నిర్వహణకు పూర్తిగా తవ్వించేశారు. దానిని కూడా చదును చేయిస్తే క్రీడాకారులకు, వాకర్స్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
- కలెక్టరేట్ భవన నిర్మాణం చాలావరకు పూర్తయ్యింది. మిగిలిన పనులు చిత్తశుద్ధితో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.
- స్టేడియం నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. దీన్ని పూర్తిచేయిస్తే నియోజకవర్గానికే కాకుండా జిల్లా ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.
- రిమ్స్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయిస్తే రోగులకు ఉపయోగకరంగా ఉంటుంది.
- కళింగపట్నం పోర్టును, నియోజకవర్గంలో ఉన్న పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు పర్యాటకులకు మంచి సౌకర్యాలు అందేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఎమ్మెల్యే శంకర్ వీటిపై అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించాలని ప్రజలు కోరుతున్నారు.

కుటీర పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలి



శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచాలి. శ్రీకాకుళం నగరంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటుకు తగిన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలి. స్మార్ట్‌సిటీ ఏర్పాటుకు నిధులు రప్పించాలి. వంశధార కాలువల ద్వారా శివారు ఆయకట్టుకు నీరందించేలా చూడాలి. మత్స్యకారుల వలసల నిర్మూలనకు ఫిషింగ్ జట్టీలు ఏర్పాటు చేయాలి. **టి.తిరుపతిరావు,** సీపీఐ శ్రీకాకుళం నియోజకవర్గ కన్వీనర్.

కూటమి ప్రభుత్వంపై ఆశలు



కూటమి ప్రభుత్వం ప్రజలకు చాలా హామీలు ఇచ్చింది. దీంతో హామీలు నెరవేరుతాయని ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే గొండు శంకర్ శాసనసభలో ప్రస్తావించాలి. ప్రధానంగా రాగోలు రోడ్డు పనులను పూర్తి చేసేలా ఎమ్మెల్యే కృషి చేయాలి.

–బి.సునీల్, శ్రీకాకుళం

ఎచ్చెర్ల నియోజకవర్గంలో..

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని 7 వేల ఎకరాలకు సాగునీరు అందించే నారాయణపురం కుడి కాలువ ఆధునికీకరణ కోసం ఎదురు చూస్తుంది. ప్రతి ఏటా ఖరీఫ్‌లో రైతులు సాగు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు.

- రణస్థలం మండలం, లావేరు మండలాల్లో 15 వేల ఎకరాలు వరకు తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్నాయి. సాగునీరు సజావుగా అందటం లేదు. మొత్తం ప్రత్యేక నిధులతో అభివృద్ధిచేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.
- జి.సిగడాం మండలంలో ఐదు వేల ఎకరాల వరకు మడ్డువలస కాలువ కింద ఉన్నాయి. సాగు సక్రమంగా సాగటం లేదు. కాలువను ఆధునికీకరిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.
- శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఆరు వేల మంది విద్యార్థులకు వసతికి అవసరమైన మౌలిక వసతులు భవనాలు అవసరం, శివానీ అద్దె క్యాంపస్‌లో నాలుగు వేల మందికే వసతి ఉంది. మూడు, నాలుగేళ్ల ఇంజినీరింగ్ క్లాస్ వర్క్ నూజివీడులో నిర్వహిస్తున్నారు. మరో పక్క రెగ్యులర్ ఫ్యాకల్టీ లేరు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు తగ్గ వసతి లేదు. 100 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ అవసరం కాగా, ఐదుగురు మాత్రమే ఉన్నారు. కాంట్రాక్టు సిబ్బందితో నెట్టుకు వస్తున్నారు.
- నియోజక వర్గంలో ప్రధానంగా ధర్మవరం, కొయ్యాం, వెంకటాపురం, కొత్తపేట వంటి రోడ్డులు గోతులు మయంగా మారాయి.
- సముద్ర తీరంలో జట్టీలు, చేపలు ఆర బెట్టే ప్లాట్ ఫారంలు అవసరం. 12 మత్స్యకార గ్రామాల్లో చేపల వేట ఆధారంగా జీవిస్తున్నారు.
- పైడిభీమవరంలో పారిశ్రామల సెజ్, ఎచ్చెర్ల ప్రాంతంలో చిన్న పరిశ్రమలు ఉన్నాయి. కొన్ని మూత పడేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ పరిశ్రమలు నిర్వహించాలంటే ప్రభుత్వ రాయితీలు అవసరం.



నారాయణపురం కుడి కాలువ

సాగునీటి సమస్య పరిష్కరించాలి



ఎచ్చెర్ల నియోజకవర్గంలో సాగునీటి సమస్య ప్రధానమైంది. నారాయణపురం, తోటపల్లి, మడ్డువలస ఇలా అన్ని ప్రాజెక్టుల కింద భూములున్నాయి. ప్రత్యేకంగా ఈ కాలువలు అభివృద్ధి చేస్తేనే సజావుగా సాగు నీరు అందుతుంది.

– సనపల నారాయణరావు, ఇబ్రహింబాద్, ఎచ్చెర్ల మండలం

రహదారులు బాగుచేయాలి



ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రధానంగా గ్రామాలను అనుసంధానం చేసే రోడ్డులు గోతులు మయంగా మారాయి. తోటపాలెం నుంచి ఎచ్చెర్ల వరకు విస్తరించి ఉన్న రోడ్డు, కొత్తపేట రోడ్డు ఇలా ప్రతీ మండలంలో రోడ్డులు ప్రధాన సమస్య. ఈ సమస్య అసెంబ్లీలో ప్రస్తావించాలి. – మూగి గురుమూర్తి, డి.మత్స్యలేశం, ఎచ్చెర్ల మండలం

జెట్టీ నిర్మాణం పూర్తి చేయాలి



రణస్థలం మండలంలో సముద్రం తీరం అధికంగా ఉంది. బుడగట్లపాలెంలో జెట్టీ నిర్మాణం పూర్తి చేయాలి. స్థానికులకు ఉపాధి కల్పనకు పెద్దపీట వేయాలి.

– మహంతి సత్యనారాయణ, వల్లభరావుపేట, రణస్థలం మండలం

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



వివరాలు సేకరిస్తున్న డిప్యూటీ ఈఓ విజయకుమారి

రణస్థలం: బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని డిప్యూటీ ఈఓ ఆర్.విజయకుమారి అన్నారు. ఎంఈఓ కార్యాలయాన్ని సోమవారం తనిఖీ చేశారు. బడి బయట ఉన్న పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నా. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారే విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలో చదివి మరో పాఠశాలకు మారే విద్యార్థుల వివరాలను తొలగించడం లేదని, అలాగే మరో పాఠశాలలో నమోదు కూడా చేయడం లేదన్నారు. అటువంటి విద్యార్థులందరూ బడి బయట ఉన్నట్లే ఆన్‌లైన్‌లో చూపిస్తోందని, తక్షణమే ప్రతి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం సరిచేయాలని ఆదేశించారు. ఎంఈఓలు త్రినాథరావు, లావణ్య, సీఆర్పీ పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి వితరణ



ఆహారాన్ని అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరం వద్ద సోమవారం నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమం ప్రాంగణంలో సత్యసాయి భజన మండలి సభ్యులు వితరణ చాటుకున్నారు. వినతులు అందించేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఆహార పొట్లాలను అందజేశారు. తొలుత నారాయణ సేవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది అర్జీదారులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ బి.మీనాక్షి, సీపీవో వి.ఎస్.ఎస్.ఎల్.ప్రసన్న, జిల్లా హార్టికల్చర్ అధికారి, డీపీఆర్వో బాలమాన్ సింగ్, సత్యసాయి భజన మండలి కన్వీనర్ భాస్కర్, సేవాదల్ సభ్యులు కృష్ణ, కృష్ణమూర్తి, భాస్కరరావు, బరాటం రమేష్, చౌదరి, మూర్తి, జిల్లా పదాధికారులు నాగేశ్వరరావు, నరసింహమూర్తి, మహిళా సేవాదల్ ప్రతినిధి రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన



జలుమూరు: రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు



సరుబుజ్జిలి: రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జలుమూరు: వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు నష్టం నుంచి తప్పించుకోవచ్చని రాగోలు వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పి.ఉదయ్‌బాబు, కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. అచ్యుతాపురం గ్రామంలో ముంపునకు గురైన వరి పంట పొలాలను ఆమె సోమవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. జూన్‌లో విత్తిన విత్తనాలు పిలక దశలో ఉండగా జూలై నెలలో విత్తినవి నారుమడి దశలో ఉన్నాయన్నారు. వర్షాలకు నారుమడి విత్తనం చల్లిన రెండు మూడు రోజులు నీట మునిగితే మొలక శాతం తగ్గుతుందని, దీని కోసం నీటిని వీలైనంత వేగంగా బయటకు పంపుకోవాలన్నారు. అలాగే విత్తన నాటి ఏడు రోజులు నుంచి 30 రోజులు వయసు గలవి ఐదు రోజులు కంటే ఎక్కువ మునిగితే నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్‌తోపాటు ఒకటి లేదా రెండు గ్రాముల కార్బండిజం వేసుకోవాలన్నారు. అలాగే పిలక దశలో నీట మునిగితే పొలం నుంచి నీరు మొత్తం బయటకు పోయిన తర్వాత 20 కిలోల పొటాష్, 20 కిలోల యూరియా చల్లుకోవాలన్నారు. నాట్లు వేసిన 15 రోజుల తర్వాత ఊదర, ఇతర గడ్డి జాతులు ఉంటే నైహలోఫాష్ ఎకరాకు 400 మిల్లీ లీటర్ల మందు తగినంత నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వీటి వల్ల కలుపు నివారణ చేసుకోవచ్చునని తెలిపారు. తుంగ, గరిక వంటి మొండి రకాల కలుపు ఉంటే నీరు బెంటాజోన్ ఎకరాకు ఆర లీటరు తగినంత నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వీరితోపాటు ఏడీఎలు రవీంద్ర భారతి, వెంకటరావు, ఏఓ సురేష్ కుమార్ రైతులు ఉన్నారు.

సరుబుజ్జిలిలో..

సరుబుజ్జిలి: ఇస్కలపాలెం, కొండవలస గ్రామాల్లోని ముంపు ప్రాంతాలను ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సి.హెచ్.బాలకృష్ణ, ఎస్.కిరణ్‌కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపుబారిన పంటను ఎలా సంరక్షించుకోవాలన్న విషయంపై రైతులకు అవగాహన కల్పించారు. నీట మునిగిన నారుమడుల నుంచి నీటిని బయటకు తీసి కార్బనిజాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులు వినియోగించుకోవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆధార్ ప్రత్యేక క్యాంపులు అందరూ వినియోగించుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆధార్ స్పెషల్ క్యాంపులను ఈ నెల 23 నుంచి 27 తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలకు 'బాల ఆధార్, 5 నుంచి 7 ఏళ్ల, 15 నుంచి 17 ఏళ్ల గల వారికి తప్పనిసరిగా బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేసుకోవాలని వివరించారు. గత పదేళ్ల కాలంలో ఆధార్ కార్డు లో పేరు, చిరునామా, పుట్టిన తేదీల్లో ఎలాంటి మార్పు చేయని వారు ఒరిజినల్ గుర్తింపు పత్రాలతో అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్, ఐసీడీఎస్ పీడీ, డీఆర్‌డీఏ పీడీ, డ్వామా, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

విద్యార్థులకు అభినందన



నగదు, జ్ఞాపికలతో సత్కరిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

పాతపట్నం: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు చదువులో మరింత ప్రోత్సహించేందుకు రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ప్రోత్సహించడం అభినందనీయమని హెచ్‌ఎం ఎన్.కుమారస్వామి అన్నారు. మండలంలోని రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంత్సరంలో పదో తరగతి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు అగతముడి మోహిత్ కుమార్, కిక్కర జగదీశ్వరరావును నగదుతోపాటు జ్ఞాపిక, పురస్కారాలను రొమదల సర్పంచ్ ఎం.అప్పలనాయుడు సోమవారం అందించారు. ట్రస్టు అధ్యక్షుడు పి.రామరాజు, ఉపాధ్యాయులు కృష్ణవేణి, గోవిందరావు, రమణ, కేశబో పాల్లాయ్, నారాయణమూర్తి, మంజుశ్రీ, ఢిల్లేశ్వరి పాల్గొన్నారు.

108 సేవలపై ఆరా



రికార్డులను పరిశీలిస్తున్న జగన్

పాతపట్నం: అత్యవసర సమయాల్లో మరింత బాధ్యతగా పనిచేయాలని, 108 వాహనం సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని పలాస డివిజన్ అధికారి జి.జగన్ అన్నారు. పాతపట్నం సీహెచ్‌సీలో ఉన్న 108 వాహనాన్ని సోమవారం పరిశీలించారు. వాహనం పనితీరు, పరికరాలు, డ్రగ్, సిబ్బంది రికార్డులను తనిఖీ చేశారు. ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. ఇటీవల కాలంలో వర్షాలు కారణంగా అప్రమత్తంగా ఉండాలని, పిడుగుపాటు, పాముకాట్లు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. మెడికల్ టెక్నీషియన్ కె.అఫీస్, పైలట్ చిన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయం తనిఖీ



ఏఆర్ కార్యాలయంలో ఫైళ్లను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సోమవారం రాత్రి తనిఖీ చేశారు. అన్ని విభాగాలను, పరిపాలన కార్యాలయం ఫైళ్లను పరిశీలించారు. డాగ్, బాంబు స్క్వాడ్ విభాగాల పనితీరు, నైపుణ్యాలను పర్యవేక్షించారు. గ్యాస్ గొడాం, జిమ్, వెపన్ స్టోర్, ట్రాన్స్‌ఫోర్ట్ గొడాం వంటివి పరిశీలించి నిర్వహణ, నైపుణ్యాలపై పలు సూచనాలు చేశారు. కార్యాలయం నిర్వహణ, పనితీరుపై డీఎస్పీ శేషాద్రి, ఆర్‌ఐలు సురేష్, నర్సింగరావులతో సమీక్షించారు.

వాస్తు నిపుణుడు మృతి



సింహాద్రి అప్పారావు(ఫైల్)

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామానికి చెందిన వాస్తు నిపుణుడు సింహాద్రి అప్పారావు (90) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈయనకు జి.సిగడాం, పొందూరు, రణస్థలం, రాజాం, సంతకవిటి, రేగిడి, తెర్లాం తదితర మండలాల్లో మంచి పేరుంది. భార్య రమణమ్మ, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మాజీ ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, మీసాల నీలకంఠంనాయుడు, కంబాల జోగులు, ఎంపీపీ మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ సంతాపం వ్యక్తం చేశారు.

బ్యాంక్ లింకేజీ లక్ష్యాలు పూర్తిచేయండి



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్

ఆమదాలవలస: బ్యాంక్ లింకేజీ లక్ష్యాలను పూర్తిచేసేందుకు మండల సమాఖ్యలు అంకితభావంతో పనిచేయాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్య కిరణ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ మండల్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. రుణాలు చెల్లించని సంఘాలను గుర్తించాలన్నారు. స్త్రీనిధి ద్వారా రుణాలు అందించి లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు.

రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులు దాచుకున్న పొదుపు డబ్బుల నుంచి సభ్యురాలి అవసరం మేరకు అప్పులు ఇచ్చుకోవడానికి ఇంటర్నల్ లాండింగ్‌ను బ్యాంకు మేనేజర్లు ప్రోత్సహించాలన్నారు. ఆమదాలవలస డీసీసీబీలో మాత్రమే 70 సంఘాలకు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. తిరిగి సక్రమంగా రీపేమెంట్ జరగడంతో రెండోసారి లింకేజీకి సిద్ధంగా ఉన్నారన్నారు. అసిస్టెంట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉమాశంకర్, స్టేట్ బ్యాంక్ మేనేజర్ కిరణ్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్, ఏపీఎంలు రవిరాజా, పైడి కూర్మారావు, కమల కుమారి, పాండ్యన్, సీఎఫ్ఎల్‌లు పాల్గొన్నారు .